## ప్రతి ఊరు నుంచి కదలుదాం

**జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత**

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున కదలుదామని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేసి మరోసారి మన సత్తా చాటుదామని చెప్పారు. జగిత్యాల రూరల్ మండలం చలిగల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులు వస్తున్నాయని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని భూములు అమ్మడం తప్పా.. ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరస్పరం విమర్శించుకోకుండా జగిత్యాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం, జిల్లా అభివృద్ధి చెందాయని చెప్పారు. తెలంగాణను దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని కొనియాడారు. ఇకముందు కూడా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ నాయకత్వం తప్పనిసరి చెప్పారు. ఎల్కతుర్తిలో నిర్వహించే మహాసభకు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో రూరల్ మండలాధ్యక్షుడు ఆనందరావు, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, కమలాకర్‌రావు, ఎల్ల రాజన్న, నలువాల తిరుపతి, పూదరి శ్రీనివాస్, బాలే చందు, పోచమల్లయ్య, యాళ్ల మహేశ్, పడాల సురేశ్, పులిశెట్టి శ్రీనివాస్, శ్రీను, మామిడిరాజు, తరాల వెంకటేశ్, బొల్లారపు గంగాధర్, గోపాల్, షేర్, సైప్, అంజన్న, శ్రీను, దర్శన్, రాకేష్, శివ, సింగావు, గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు




బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కి సభ ఖర్చుల కోసం విరాళం అందజేస్తున్న ఇబ్రహీంపట్నం మండల కార్యకర్తలు

# సక్సెస్ చేద్దాం.. సత్తాచాటుదాం

- రజతోత్సవ సభకు ఐదు వేల మందిని తరలిద్దాం
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపు
- కోరుట్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం
- సభ కోసం విరాళం అందించిన ఆటో కార్మికులు, నాయకులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్దసంఖ్యలో తరలి వెళ్దామని, సభను సక్సెస్ చేసి మరోసారి మన సత్తాచాటుదామని ఆ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులోని కేఎన్‌రెడ్డి గార్డెన్స్‌లో గురువారం బీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమానికి పాటుపడింది, పాటుపడేది ఒక్క బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. కేసీఆర్ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, నిరంతర విద్యుత్, సాగు, తాగునీటికి ఇబ్బందుల్లేకుండా పాలన సాగిందని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో అస్తవ్యస్తంగా మారిందని, సాగునీరు లేక పంటలు ఎండిపోయే దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించిన సభకు కోరుట్ల నియోజకవర్గం నుంచి ఐదు వేల మందిమి కదులుదామని, వంద బస్సుల్లో తరలివెళ్దామని పిలుపునిచ్చారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, వరంగల్ సభకు నియోజకవర్గం నుంచి మూడు వేలకు తగ్గకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందితే, ఏడాది కాంగ్రెస్ పాలనలో పదేళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. కాగా, రజతోత్సవ సభ ఖర్చుల నిమిత్తం మల్లాపూర్ మండలం ముత్యంపేట ఆటో కార్మికులు ₹5వేలు విరాళంగా అందజేశారు. అలాగే మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, మల్లాపూర్ మండలాల బీఆర్ఎస్ నాయకులు సైతం సభ ఖర్చుల కోసం విరాళాలను అందించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మెట్‌పల్లి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్ రావు, ఇబ్రహీంపట్నం, కోరుట్ల పార్టీ మండలాధ్యక్షులు ఎలాల దశరత్‌రెడ్డి, దారిశెట్టి రాజేశ్, సందిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పదిరలో మహిళకు బొట్టుపెట్టి సభకు రావాలని ఆహ్వానిస్తున్న నాయకురాలు

### బొట్టుపెట్టి 'సభ'కు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం పదిరలో సెస్ మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కుంబాల వజ్రవ్వ ఇంటింటా బొట్టుపెట్టి సభకు రావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి వారు సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కుంబాల లక్ష్మారెడ్డి, యూత్ అధ్యక్షుడు కామిడి శ్రీకాంత్, ఊరడి ఎల్లయ్య, రాజం, మంజుల, గెంటె లింగయ్య, భీమ్‌రెడ్డి, మధు, సాయికృష్ణ, బాలయ్య తదితరులు ఉన్నారు.

## గులాబీ దండు కదం తొక్కాలి

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపు**



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ దండు కదం తొక్కాలని, ఓరుగల్లు దద్దరిల్లాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. అందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని నిర్దేశం చేశారు. బుధవారం రాత్రి గోదావరిఖని పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ నియోజకవర్గ ముఖ్యనేతల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన ఫెయిల్ అయిందని, ఏడాదిన్నర కాలంలో ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీస్తే తనతోపాటు పార్టీ నాయకులపై 12 కేసులు పెట్టించారని ఆగ్రహించారు. అయినా ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాడుతునే ఉంటామని స్పష్టం చేశారు. రోజురోజుకూ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్నదని, ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే సభకు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి, నడిపెల్లి మురళీధర్‌రావు, పెంట రాజేశ్, జేవీ రాజు, గోపు అయిలయ్య, పాముకుంట్ల భాస్కర్, రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, రాకం వేణు, శ్రీనివాస్, కవిత సరోజని, అచ్చవేణు, తిరుపతి, శ్రీనివాస్, సదానందం, తిరుపతి, దేవరాజ్ సంధ్యారెడ్డి, లక్ష్మి, శ్రీనివాస్, వెంకన్న, రామారాజు, శ్రావణ్, రామకృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.



సన్నాహక సమావేశానికి హాజరైన నాయకులు



రామగిరి: విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

## అధ్యాపకుల నిరసన

**అక్రమ అరెస్టులను ఖండిస్తూ జేఎన్‌టీయూల్లో విధులు బహిష్కరణ**

రామగిరి/వేములవాడ రూరల్, ఏప్రిల్ 10: కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మహిళా కాంట్రాక్ట్ అధ్యాపకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జేఎన్‌టీయూల్లో అధ్యాపకులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు జీవో నంబర్ 21కు వ్యతిరేకంగా శాంతియుత నిరసన చేపట్టడానికి వెళ్లిన రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలకు చెందిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మహిళా కాంట్రాక్ట్ అధ్యాపకులపై పోలీసులు ప్రవర్తించిన తీరును ఖండించారు. ఈ మేరకు గురువారం మంథని జేఎన్‌టీయూ, వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాల ఆవరణలోని జేఎన్‌టీయూ కళాశాలల్లో ప్రొఫెసర్లు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. వేములవాడలో జేఎన్‌టీయూ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు భాస్కర్, రంజిత్‌కుమార్, శ్రవణ్‌కుమార్, రవికుమార్, తదితరులు ఉన్నారు.

# రైతన్నకు కడగండ్లు

సిరిసిల్ల బీవైనగర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు



- ఈదురుగాలతో వడగండ్ల వాన
- ఆరుగాలం కష్టం నేలపాలు
- సిరిసిల్ల జిల్లాలో వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- కరీంనగర్ జిల్లా గన్నేరువరంలో ప్రభావం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ)/గన్నేరువరం : అకాల వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కండగండ్లు మిగిల్చింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పడిన వానకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పంట చేతికందే దశలో నేలపాలైంది. సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు గంభీరావుపేట, ఇల్లంతకుంట, కోనరావుపేట, వేములవాడరూరల్, ఇల్లంతకుంట మండలం అనంతగిరి, వేములవాడ రూరల్ మండలంలోని బొల్లారం, లింగంపల్లిలో వరిపంట దెబ్బతిన్నది. కోనరావుపేట మండలం మంగళంపల్లిలో మక్క నేలకొరిగింది. వడగండ్ల వానకు వందల ఎకరాలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని మాదాపూర్, పీచుపల్లి, జంగపల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షానికి వరి, మక్క, మామిడి రైతులకు అపార నష్టం జరిగింది. మాదాపూర్‌లో రైతులు మాడుగుల మహేశ్, గొడుగు స్వామికి చెందిన మక్క పంట నేలకొరిగింది. పొలాల్లో వడ్లు, మామిడి తోటల్లో కాయలు నేలరాలిపోయాయి. ఈ మూడు గ్రామాల్లో 40మంది రైతులకు చెందిన 126 ఎకరాల వరి, ఆరుగురు రైతులకు చెందిన మక్క పంటకు నష్టం వాటిల్లినట్లు కలెక్టర్‌కు అధికారులు ప్రాథమిక నివేదిక అందించారు.



గన్నేరువరం: మాదాపూర్‌లో వడగళ్ల వర్షానికి రాలిన వడ్లను చూపుతున్న రైతు పీచు ఆదిరెడ్డి

### నిర్లక్ష్యానికి తడిసిన ధాన్యం

కొనుగోలు కేంద్రాలకు చేర్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. రాత్రి వేళ వాన పడడడంతో ధాన్యం కుప్పల వద్దకు రైతులు చేరుకోలేక పోయారు. అయితే కొనుగోళ్లలో జాప్యం, రోజుల తరబడి కేంద్రాల్లోనే పేరుకుపోవడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆరురోజుల కిందట ధాన్యం తెస్తే ఇంత వరకు ఏఅధికారి తమను పట్టించుకోలేదని ఎర్రం ఎల్లయ్య అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెంట వెంట కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

గన్నేరువరం: నేలవాలిన మక్క





గంభీరావుపేట: గజసింగవరం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

## రూ.10 లక్షల విలువైన 100 సెల్‌ఫోన్లు రికవరీ

- సీఈఐఆర్ పోర్టల్‌తో సత్ఫలితాలు
- సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గితె
- బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



యువకుడికి సెల్‌ఫోన్‌ను అందిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గితె

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన రూ.10లక్షల విలువైన వంద సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేశామని రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గితె తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు సెల్‌ఫోన్లు అందజేసి, మాట్లాడారు. సెల్‌ఫోన్ దొంగలకు చెక్ పెట్టేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ డీవోటీ, సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈ పోర్టల్ వినియోగం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని, చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేయడంలో జిల్లాకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 1,887సెల్ ఫోన్లను గుర్తించి 1,587 మంది బాధితులకు అందించామని చెప్పారు. ఫోన్ల రికవరీలో జిల్లా 84.1శాతంతో గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిలో సెల్‌ఫోన్ లేనిదే లావాదేవీలు చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. సెకండ్ హ్యాండ్ ఫోన్ కొనుగోలు చేస్తే సంబంధిత షాపు నుంచి రసీదు తీసుకోవాలని సూచించారు. ఫోన్లను రికవరీ చేసిన ఐటీకోర్ సిబ్బందిని అభినందించారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లు అప్పగించిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, ఐటీకోర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, ఆర్ఐలు రమేశ్, యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## పసుపు ధర @ రూ.13,711

మెట్‌పల్లి, ఏప్రిల్10: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపు కొమ్ము(కాడి) రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.13,711 పలికింది. కనిష్ఠంగా రూ.9,091 రేటు వచ్చింది. పసుపు మండ (గోళ) రకానికి గరిష్ఠంగా రూ.13,121,కనిష్ఠంగా రూ.8,673 , పసుపు చూర రకానికి గరిష్ఠంగా రూ.10,369, కనిష్ఠంగా రూ.8,989 చొప్పున ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 44,177 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

### రెవెన్యూ సర్టిఫికెట్ల కోసం
## పడిగాపులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 10: ప్రభుత్వం ఇటీవల రాజీవ్ యువవికాసం పథకం కోసం నోటిఫికేషన్ వేసింది. అందుకోసం నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం కావడంతో చాలా మంది మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, అర్బన్ మండలాల తహసీల్ కార్యాలయాల్లోని మీ సేవ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సర్టిఫికెట్ల జారీలో ఆలస్యమవుతున్నది. దీంతో నిరుద్యోగులు తమ సర్టిఫికెట్ల కోసం తహసీల్ కార్యాలయాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. రాజీవ్ యువవికాసం దరఖాస్తుకు గడువు దగ్గర పడుతున్నా.. సర్టిఫికెట్ల కోసం అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




సర్టిఫికెట్ల కోసంవచ్చిన నిరుద్యోగులు



### ఎండ భగభగ.. మూగజీవాలు విలవిల

భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం నుంచే దంచికొడుతున్నాడు. దీంతో జనాలే కాదు.. మూగజీవాలు సైతం అల్లాడుతున్నాయి. ఎండలను తట్టుకోలేకపోతున్నాయి. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం నాంసానిపల్లిలో ఓ శునకం గ్రామంలో రైతు ఏర్పాటు చేసిన పశువుల నీటితొట్టిలో కూర్చొని చల్లదనాన్ని ఆస్వాదించింది. ఈ దృశ్యాన్ని 'నమస్తే' క్లిక్‌మనిపించింది.

- ఓదెల, ఏప్రిల్ 10

## భూకంప భయం!

- రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి హెచ్చరిక
- సోషల్ మీడియాలో వైరల్
- భయాందోళనలో ప్రజలు

పెద్దపల్లి, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ)/కోల్‌సిటీ: రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి భూకంప హెచ్చరిక వచ్చినట్టు విస్తృత ప్రచారం జరుగుతున్నది. ఈ నెల 10 నుంచి 17వ తేదీ మధ్య భూకంపం వచ్చే ముప్పు ఉన్నట్లు ఎపిక్ ఎర్త్ క్వేక్ రీసెర్చ్ ఎనాలసిస్ సెంటర్ తెలిపింది. దీని ప్రభావం రామగుండంపై పడొచ్చని ఆ సంస్థ తన ట్విట్టర్‌లో వెల్లడించింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. దీంతో రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజుల క్రితం బ్యాంకాక్, మయన్మార్‌లలో సంభవించిన భూకంపం దాటికి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన విషయం విధితమే. అయితే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో స్వల్ప భూకంపం వచ్చినా.. ఇక్కడ పూర్తిగా సింగరేణి భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులు విస్తరించి ఉండడంతో తీవ్రత అధికంగా ఉండే ప్రమాదముంటుంది. ఏదీ ఏమైనప్పటికీ భూకంపం వస్తుందన్న ప్రచారంతో ప్రజలు భయకంపితులవుతున్నారు. పొద్దంతా ఎక్కడ చూసినా దీనిపైనే చర్చిస్తున్నారు. భూకంప విషయాన్ని విస్తృతంగా షేర్ చేస్తున్నారు.